ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఆగస్టు 2024



విహారయాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడు రంగారెడ్డి జిల్లా యువకుడు
- పాడేరు ప్రాంతం సందర్శనకు హైదరాబాద్ నుంచి బృందం రాక

.... వివరాలు 7వ పేజీలో

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

జిల్లాలో ఎన్నికలు జరిగిన స్కూళ్లు 1,416

- 14 ఏకగ్రీవం.. కోరం లేక 34 వాయిదా
- ఒకటి బ్యాలెట్ పద్ధతిలో, మిగతా 1,367 సజావుగా నిర్వహణ



అనకాపల్లి మండలం సిరసపల్లిలో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ కార్యవర్గం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీ) ఎన్నికలు స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 1,464 పాఠశాలలు ఉండగా, 1,416 పాఠశాలల్లో శనివారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రక్రియను జిల్లా విద్యాశాఖాధికారులు ప్రారంభించారు. 14 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 34 చోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. మునగపాక మండలం టి.సిరసపల్లిలో బ్యాలెట్ పద్ధతిలో జరగగా, మిగతా 1,367 పాఠశాలల్లో సజావుగా ఎన్నికలు జరిగాయి.

జిల్లాలోని పలు పాఠశాలల్లో ముందుగా విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు నామినేషన్లు స్వీకరించారు. ఏకగ్రీవం కానిచోట తల్లిదండ్రులు చేతులెత్తే విధానంలో ఎన్నికలు చేపట్టారు. ప్రతి తరగతి నుంచి ఇద్దరు మహిళలు, ఒక పురుషుడిని సభ్యులుగా తొలుత ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి విధివిధానాలను వివరించారు. కొన్ని పాఠశాలల్లో కమిటీల ఎన్నికల సందర్భంగా స్వల్ప వివాదాలు, కొన్నిచోట్ల కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్టు విద్యాశాఖాధికారులు వెల్లడించారు. వాయిదా పడిన పాఠశాలల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.

పలు పాఠశాలల్లో కోరం లేక వాయిదా

జిల్లాలో 34 పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. అనకాపల్లి మండలంలో 107 పాఠశాలలు ఉండగా, 104 పాఠశాలల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. కొప్పాక, సీతానగరం, గవరపాలెం గురుకుల పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. మునగపాక మండలం టి.సిరసపల్లిలో వైసీపీ నాయకులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను రహస్య ప్రదేశానికి తరలించారు. దీనిపై టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేయడంతో బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిపారు. కూటమి మద్దతుదారుడు కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. గొలుగొండ మండలం పాకలపాడు ఉన్నత పాఠశాలలో ఎన్నికల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారుడు కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చీడికాడ మండలం వరహాపురం హైస్కూల్‌లో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఎన్నికల్లో చైర్మన్‌గా మిస్కా అప్పారావు ఎన్నికయ్యారు. అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపపాలెం పాఠశాల కమిటీ ఎన్నికలను కోరం లేక వాయిదా వేశారు. కోటవురట్ల మండలంలో ఒక ప్రాథమికోన్నత పాఠశాల, మూడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. మాకవరపాలెం మండలం బూరుగుపాలెంలో ఎన్నికల నిబంధనలు పాటించలేదంటూ టీడీపీ, వైసీపీ వర్గీయులు నిరసన తెలపడంతో ఎన్నికలు వాయిదా వేశారు. చోడవరం మండలం నంబారువానిపాలెం పాఠశాలలో, మాడుగుల మండలం గొటివాడ అగ్రహారం పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. నాతవరం మండలం తాండవ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీకే గూడెం ప్రాథమిక పాఠశాల కమిటీల ఎన్నికలు కోరం లేక ఆగిపోయాయి. సబ్బవరం మండలం పాత సబ్బవరం ప్రాథమిక పాఠశాలలో, పరవాడ మండలం తానాం ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. కొన్నిచోట్ల కోరం లేక, మరికొన్ని పాఠశాలల్లో రెండు వర్గాలు వ్యక్తం చేసిన అభ్యంతరాల నేపథ్యంలో ఎన్నికలు వాయిదా వేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ తెలిపారు. ఆయా పాఠశాలల్లో తిరిగి ఎన్నికలు ఎప్పుడనేది త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా

- జిల్లాలో ఐదు వేల మందికి స్థానచలనం కలిగే అవకాశం
- పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు మినహాయింపు



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. బదిలీల ప్రక్రియను ఈ నెల 31వ తేదీలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సుమారు 16 వేల మంది పైచిలుకు వివిధ హోదాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన సుమారు 10 వేలమందికి బదిలీల నుంచి ప్రస్తుతానికి మినహాయింపు ఇచ్చింది. దీంతో జిల్లాలో ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల మందికి స్థానచలనం కలుగుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఐదేళ్లు ఒకే చోట పని చేస్తే బదిలీ తప్పనిసరి

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు మునిసిపల్, దేవదాయ, రవాణా, అటవీ, పర్యావరణ, పరిశ్రమలు, విద్యుత్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నుల శాఖలతో పాటు రెవెన్యూ, ల్యాండ్స్, పౌర సరఫరాలు, గనులు, పంచాయతీరాజ్, ఇతర శాఖ ఇంజనీరింగ్ విభాగాల్లో అధికారులకు బదిలీకానున్నది. ఐదేళ్లు, అంతకు మించి ఒకేచోట ఉద్యోగం చేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. గిరిజన ప్రాంతంలో రెండేళ్లు పనిచేసిన ఉద్యోగులకు బదిలీలకు అవకాశం కల్పించారు. ఉద్యోగి లేదా కటుంబ సభ్యులకు ఏదైనా అనారోగ్య కారణాలున్నా బదిలీలకు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించారు. విద్య, వైద్య, వ్యవసాయం, పశుసంవర్థక, ఎక్సైజ్ శాఖల్లోని ఉద్యోగులకు బదిలీల్లో ప్రస్తుతానికి మినహాయింపునిచ్చారు. ఆయా శాఖల ఉద్యోగులకు బదిలీలు ఎప్పడనేది ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది.

గంజాయిపై ఉక్కుపాదం

సాగు, రవాణా నియంత్రణపై దృష్టిపెట్టండి



ఎస్పీలతో చర్చిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టీ

- ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలకు డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశం
- పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలు
- ఏజెన్సీతో అనుసంధానమైన రహదారుల్లో చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా
- తరచూ పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్
- గంజాయి సాగుదారులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలి

విశాఖపట్నం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

గంజాయి సాగు, రవాణా నియంత్రణపై గట్టిగా దృష్టిసారించాలని ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వంద రోజుల కార్యాచరణపై ఎస్పీలతో ఆయన శనివారం సమీక్ష నిర్వహించారు. కైలాసగిరిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశమై గంజాయి నియంత్రణ, కేసుల దర్యాప్తు, నిందితులపై చర్యలకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉంటూ పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి 27 ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. నేరస్తులను పట్టుకునేందుకు నిర్దిష్ట కాలపరిమితిని డీఐజీ నిర్దేశించారు. గంజాయిని ఇతర రాష్ట్రాలకు రవాణా చేసేందుకు వినియోగించే మార్గాలను గుర్తించాలని ఎస్పీలను ఆదేశించారు. ఏజెన్సీతో అనుసంధానమైన మైదాన ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయడంతోపాటు తగినంత సిబ్బందిని నియమించి, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేయాలన్నారు. తరచూ గంజాయి రవాణాకు పాల్పడుతున్న 59 మందిపై పీడీ యాక్ట్‌కు ప్రతిపాదనలు చేశామని, దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉందని డీజీఐ వివరించారు. కంటైనర్లలో గంజాయి రవాణా గుర్తించేందుకు వీలుగా నర్సీపట్నం, అనకాపల్లిలో స్నిపర్‌డాగ్ స్క్వాడ్‌ను అందుబాటులోకి తెచ్చామని అనకాపల్లి ఎస్పీ దీపికాపాటిల్ వివరించారు. 2024లో ఇంతవరకూ విశాఖ పరిధిలోనే 223 గంజాయి కేసులు నమోదుచేసి రూ.4.75 కోట్ల విలువైన 9,517 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని డీఐజీ వివరించారు. ఈ కేసుల్లో 545 మందిని అరెస్టు చేయగా...వారిలో 249 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారన్నారు. నిందితుల నుంచి 155 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి సాగవుతున్న ప్రాంతాలు ఒడిశా సరిహద్దు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్టు శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించామన్నారు. గంజాయి సాగు చేస్తున్న ప్రాంతాలకు ఎస్పీలు, ఇతర అధికారులు వెళ్లి ప్రత్యామ్నాయ పంటలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఐజీ ఆదేశించారు. దీనికోసం ప్రభుత్వ శాఖల అంతర్గత కమిటీ ఏర్పాటుచేసి తరచూ గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కళాజాతలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నిషేధం, వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాలపై గిరిజనులకు అర్థమయ్యేలా ముఖ్యమైన జంక్షన్లు, ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేయాలని కోరారు. ఈ సమావేశంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపికాపాటిల్, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధార్, విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏడీపీఎస్ స్పెషల్ ప్రాసిక్యూటర్ వి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

- పట్టించుకోని అధికారులు



కొత్తపల్లి బుచ్చెయ్యపేటలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

కశింకోట, ఆగస్టు 17:

మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా శారదానది గట్టును అనుకొని ఉన్న పంట పొలాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

కొత్తపల్లి బుచ్చెయ్యపేట, తాళ్లపాలెం వద్ద ఉన్న మామిడివాక గెడ్డ, ఏఎస్‌పేట, జమ్మాదులపాలెం గెడ్డవాగు, భీమవరం గెడ్డవాగు తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండాపోయింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైన్స్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నేరుగా ఇసుక రీచ్‌ల ద్వారా సామాన్యుడికి అందుబాటులోకి తీసుకువచ్చినా అక్రమార్కులు మాత్రం ఎక్కడబడితే అక్కడ శారదానది పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి శారదానది పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

గాడి తప్పిన బడి

గత వైసీపీ సర్కారు అస్తవ్యస్త విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

- కొత్తగా చేరికలు లేక వెలవెల
- మండలంలో గతేడాది 6,498 మంది విద్యార్థులుండగా, ఈ ఏడాది 5,690కి తగ్గిన సంఖ్య
- సింగిల్ డిజిట్‌కి పడిపోయిన రెండు పాఠశాలలు
- సత్యవరం మెయిన్ స్కూల్లో 1, 2, 4 తరగతులకు విద్యార్థులే లేరు

పాయకరావుపేట/రూరల్, ఆగస్టు 17:

గత వైసీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాల ప్రభావం ప్రభుత్వ పాఠశాలలపై పడింది. దీంతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్ది విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు అందజేస్తున్నా మూడు, నాలుగు, ఐదు తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేయడం ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారింది.

మండలంలోని 24 పంచాయతీల్లో 57 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులను దూరంగా ఉన్న హైస్కూళ్లలో విలీనం చేయడంతో విద్యార్థులు లేక ప్రాథమిక పాఠశాలలు వెలవెలబోతున్నాయి. హైస్కూళ్లు దూరంగా ఉండడంతో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నది. గతేడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 6,498 మంది విద్యాభ్యాసం చేయగా.. ఈ ఏడాది 5,690కి పడిపోవడం ఇందుకు నిదర్శనం.

తగ్గిన విద్యార్థుల సంఖ్య

మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో గతేడాది ఒకటవ తరగతిలో 376 మంది విద్యార్థులు చేరగా.. ఈ ఏడాది 308 మంది చేరారు. రెండవ తరగతిలో గతేడాది 398 మంది ఉండగా.. ఈ ఏడాది 380కి తగ్గారు. అదే విధంగా మూడవ తరగతిలో 456 మంది ఉంటే ఈ ఏడాది 389కి తగ్గారు. గతేడాది నాల్గవ తరగతిలో 676 మంది ఉంటే ఈ ఏడాది 458కి తగ్గింది. ఐదవ తరగతిలో గతేడాది 692 మంది ఉంటే ఈ ఏడాది ఆ సంఖ్య 629కి తగ్గింది. మండలంలోని 40 ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు ఏడు పాఠశాలల్లో మాత్రమే ఉన్నాయి. వీటిలో సత్యవరంలోని ఎంపీపీ స్పెషల్ స్కూల్లో ఆరుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. వీరిలో ముగ్గురు 1వ తరగతి, ముగ్గురు 2వ తరగతి చదువుతున్నారు. ఇక 1 నుంచి 5వ తరగతి వరకు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలు 33 ఉండగా.. వీటిలో సత్యవరం మెయిన్ స్కూల్లో అతి తక్కువగా ఏడుగురు విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. వీరిలో 3వ తరగతికి ఇద్దరు, 5వ తరగతికి ఐదుగురు మాత్రమే ఉండగా 1, 2, 4 తరగతులకు విద్యార్థులే లేరు. మండలంలో 10 నుంచి 20లోపు విద్యార్థులున్న పాఠశాలలు తొమ్మిది ఉండగా, 21 నుంచి 30 లోపు విద్యార్థులున్న పాఠశాలలు 13 ఉన్నాయి. మండలంలో రెండు ప్రాథమిక పాఠశాలల్లో వందకుపైగా విద్యార్థులుండగా, వీటిలో పాల్తేరు ఎంపీపీ స్కూల్లో గతేడాది ఒకటి నుంచి 5వ తరగతి వరకు 152 మంది విద్యార్థులు చదవగా.. ఈ ఏడాది 119 మందే ఉన్నారు. అదే విధంగా నామవరం ఎంపీపీ స్కూల్లో గతేడాది 129 విద్యార్థులుండగా, ఈ ఏడాది 105 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలపై ఉపాధ్యాయ సంఘాలు కూడా పెదవివిరుస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఏడుగురు విద్యార్థులు ఉన్న పాయకరావుపేట మండలంలోని సత్యవరం మెయిన్ స్కూల్

విద్యార్థులు పది మంది.. టీచర్లు ఇద్దరు

అనకాపల్లి టౌన్:

మండలంలోని గోపాలపురం ఎంపీయూపీ స్కూల్‌లో 2021-22 విద్యా సంవత్సరంలో 85 మంది విద్యార్థులు ఉండేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విలీనంలో భాగంగా కొందరు విద్యార్థులను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తారకరామకాలనీ ఉన్నత పాఠశాలకు తరలించారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పదికి పడిపోయింది. ఈ స్కూల్‌లో హెచ్ఎం కొమ్మోజు సత్యవేణి, సెకండరీ గ్రేడ్ టీచర్ పొలమరశెట్టి విజయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఎస్‌జీటీగా ఉన్న విజయ్‌కుమార్‌ను డిప్యూటేషన్‌పై విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలలకు తిప్పుతున్నారు. అయితే శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఉండడంతో ఆయన కూడా శనివారం పాఠశాలలో విధులకు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఒకటో తరగతిలో ముగ్గురు, రెండో తరగతిలో ఇద్దరూ, మూడో తరగతిలో ఇద్దరూ, ఐదో తరగతిలో ముగ్గురు విద్యార్థులు ఉన్నారు.



గోపాలపురం ఎంపీయూపీ స్కూల్‌లో పాఠాలు చెబుతున్న హెచ్ఎం సత్యవేణి

నిరసన వెల్లువ

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై ఆందోళనలు
- జిల్లా వ్యాప్తంగా వైద్యులు, సిబ్బంది ర్యాలీలు

అనకాపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల వైద్యులు, సిబ్బంది ఆందోళనలు చేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్, ఏపీ వైద్యాధికారుల సంఘం పిలుపు మేరకు ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లోని సీనియర్ వైద్యులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి, నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రితో పాటు జిల్లాలో ఎనిమిది కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వైద్య సేవలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ప్లకార్డులు పట్టుకుని వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. నిరసన ర్యాలీలు, మానవహారం నిర్వహించారు.



వైద్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట మానవహారంగా ఏర్పడిన వైద్యులు, సిబ్బంది

ఎన్టీఆర్ వైద్యాలయంలో..

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయంలోని వైద్యులు, సిబ్బంది ఆందోళనలో పాల్గొనడంతో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రోగులకు ఎటువంటి సేవలు అందలేదు. ఆ తరువాత సేవలు కొనసాగించారు. అంతకు ముందు సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్యాలయం ఎదుట ప్లకార్డులతో మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు.

అనంతరం ర్యాలీ నిర్వహించి వైద్యాలయం ఎదుట మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

52మందికి పోస్టింగ్స్ - 7లో

క్రైం... crime news

విహారయాత్రలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడు రంగారెడ్డి జిల్లా యువకుడు
- పాడేరు సందర్శనకు హైదరాబాద్ నుంచి బృందం రాక


ప్రమాదంలో మృతిచెందిన శరత్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17: విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. ఏజెన్సీ ప్రాంత సందర్శనకు హైదరాబాద్ నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఒకరు శుక్రవారం రాత్రి అనకాపల్లి బైపాస్ జంక్షన్‌కు సమీపంలో ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో మృతిచెందారు. మరో యువతి తీవ్రంగా గాయపడింది. ఇందుకు సంబంధించి శనివారం ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న ఏడుగురు శుక్రవారం విశాఖ చేరుకున్నారు. వారిలో ఐదుగురు రెండు ద్విచక్ర వాహనాలను అద్దెకు తీసుకుని ఒక బండిపై ఇద్దరు, మరో బండిపై ముగ్గురు అల్లూరి జిల్లా పాడేరు సమీపాన గల వంజంగి పర్యాటక ప్రాంతాన్ని తిలకించేందుకని బయలుదేరారు. పాడేరు వెళ్లేందుకు దారి తెలియక జాతీయ రహదారిపై అనకాపల్లి బైపాస్ జంక్షన్ వరకూ వచ్చేశారు. దారి తప్పామని అక్కడ గుర్తించారు. ఐదుగురిలో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా చంద్రానగర్‌కు చెందిన పురాల శెట్టి శరత్‌కుమార్ (24), ములుగు జిల్లాకు చెందిన యువతి ఒక వాహనంపై ఉన్నారు. వీరు పాడేరుకు ఎలా వెళ్లాలో స్థానికుల ద్వారా తెలుసుకుని...తమకంటే ముందు వెళుతున్న ముగ్గురికి సమాచారం అందించారు. అక్కడున్న వంతెన పైనుంచి సర్వీస్ రోడ్డులోకి రావాల్సిందిగా చెప్పి...అక్కడ వేచి ఉన్నారు. ముగ్గురు స్నేహితులు వంతెన పైనుంచి సర్వీస్ రోడ్డులోకి వచ్చేందుకు వాహనాన్ని మలుపు తిప్పుతుండగా అదే సమయంలో విశాఖ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇంటర్‌సిటీ బస్సు వచ్చింది. ఆ ముగ్గురినీ తప్పించబోయి సర్వీస్ రోడ్డులో ఆగి ఉన్న శరత్‌కుమార్‌ను, పక్కనున్న యువతిని ఢీకొంది. దీంతో శరత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. యువతి తీవ్రంగా గాయపడడంతో అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స చేసి అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్నేహితుల్లో ఒకరైన ఎండపల్లి ప్రమోద్‌శర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ పైడపునాయుడు తెలిపారు. విశాఖలో చికిత్స పొందుతున్న యువతి ప్రాణాపాయం నుంచి బయటపడినట్టు తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య


సంతోష్‌కుమార్ (ఫైల్)

పరవాడ, ఆగస్టు 17: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వై.సంతోష్‌కుమార్ (39) భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నారు. ఇతను ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ రాత్రి సంతోష్‌కుమార్ భార్య వాణితో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని అమ్మవారింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంతోష్‌కుమార్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇదిలావుండగా సంతోష్‌కుమార్ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పరవాడ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ సురేష్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలను సేకరించారు. సంతోష్‌కుమార్ మృతి చెంది మూడు రోజులు గడిచి ఉండొచ్చనని పోలీసులు భావిస్తున్నారు. శరీరం పూర్తిగా ఉబ్బిపోయింది. మృతుడు సంతోష్‌కుమార్‌కు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్య వాణితోపాటు అనీషా (9), మనీషా (4) కుమార్తెలు ఉన్నారు. గతంలో వీరు అనకాపల్లి మండలం మారేడుపూడిలో నివాసం ఉండేవారు. వారం క్రితమే జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి వచ్చారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తల్లి వెంకటరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

కొత్తూరు, ఆగస్టు 17: అనకాపల్లి మండలం బవులవాడ గ్రామ సమీపంలో శనివారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. బవులవాడ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందని అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. ఎటువంటి ఆధారాలు దొరకలేదన్నారు. దీంతో ఆ వ్యక్తి మృతదేహాన్ని ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తేజేశ్వరరావు చెప్పారు.

ద్విచక్ర వాహనం పైనుంచి పడి ఒకరి మృతి


పోలిన భాస్కరరావు (ఫైల్)

కొత్తూరు, ఆగస్టు 17: మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన పోలిన భాస్కరరావు(34) ద్విచక్రవాహనంపై నుంచి జారి పడి మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు. శనివారం పోలిన భాస్కరరావు ఇంటి వద్ద నుంచి తుమ్మపాల గ్రామానికి పనిపై వచ్చి తిరిగి వెంకుపాలెం మీదుగా కుంచంగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో గాటీల గొయ్యి వద్ద పడిపోయాడు. ఈ ప్రమాదంలో భాస్కరరావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అనకాపల్లిలోని ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందాడని ఆయన తెలిపారు. భాస్కరరావు భార్య భవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. కాగా ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.14 లక్షలు చోరీ

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 17 : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డులో గల ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత చోరీ జరిగినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. దుండగులు ఏటీఎంలో చొరబడి గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేసి నగదు చోరీకి పాల్పడ్డారన్నారు. సుమారు రూ.14లక్షలు చోరీకి గురైనట్టు గుర్తించామన్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరిస్తుందని, చోరీకి పాల్పడిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ, సీఐ గఫూర్ పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

- 52 మందికి పోస్టింగ్స్

విశాఖపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో శనివారం రాత్రి విశాఖ రేంజ్ పరిధిలో భారీగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి.

ఇప్పటికే పలుచోట్ల పనిచేస్తున్న అధికారులు, పోస్టింగ్స్ కోసం ఎదురుచూస్తున్న మొత్తం 52 మందిని బదిలీ చేస్తూ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఉత్తర్వులు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రేంజ్‌లో ఇంత ఎక్కువ మందిని బదిలీలు చేయడం ఇదే తొలిసారి.

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న సర్కిల్	బదిలీ అయిన సర్కిల్
టీవీ విజయకుమార్	సోషల్‌మీడియా సెల్	అనకాపల్లి టౌన్ విజయనగరం
చిల్లా నరసింగరావు	విశాఖ రేంజ్	రాంబిల్లి
ఎస్.లక్ష్మణరావు	రాంబిల్లి	విశాఖ రేంజ్
ఎ.విజయకుమార్	నక్కపల్లి యూపీఎస్	టెక్కలి యూపీఎస్
పి.పైడయ్య	టెక్కలి యూపీఎస్	విశాఖ రేంజ్
కె.కుమారస్వామి	అనకాపల్లి సోషల్ మీడియాసెల్	నక్కపల్లి యూపీఎస్
జి.కోటేశ్వరరావు	విశాఖ రేంజ్	కొత్తకోట
ఎల్.అప్పలనాయుడు	కొత్తకోట సర్కిల్	విశాఖ రేంజ్
ఎస్.ధనుంజయరావు	అనకాపల్లి రూరల్	ఎలమంచిలి
ఎస్‌కే గఫూర్	ఎలమంచిలి	విశాఖ రేంజ్
కె.సతీశ్‌కుమార్	రుషికొండ మెరైన్	బొబ్బిలి టౌన్
ఎం.నాగేశ్వరరావు	బొబ్బిలి టౌన్	విశాఖ రేంజ్
ఎల్.హిమగిరి	డీఎస్‌బీ, ఏఎస్‌ఆర్ జిల్లా	అరకు
సీహెచ్ రుద్రశేఖర్	అరకు	విశాఖ రేంజ్
బి.అప్పలనాయుడు	విశాఖ రేంజ్	డీఎస్‌బీఏఎస్‌ఆర్ జిల్లా
జి.అశోక్‌కుమార్	డీటీసీ, ఏఎస్‌ఆర్ జిల్లా	విజయనగరం రూరల్
ముదిలి శ్రీనివాసరావు	విజయనగరం రూరల్	జీకే వీధి
వి.నారాయణరావు	డీసీఆర్‌బీ, ఏఎస్‌ఆర్ జిల్లా	పార్వతీపురం టౌన్
హెచ్ మల్లేశ్వరరావు	విశాఖ రేంజ్ డీసీఆర్‌బీ	ఏఎస్‌ఆర్ జిల్లా
పీవీవీఎస్ఎన్ నరసింహరావు	పార్వతీపురం టౌన్	విశాఖ రేంజ్
వి.అప్పలరాజు	పాయకరావుపేట యూపీఎస్	చోడవరం యూపీఎస్
బమ్మిడి శ్రీనివాసరావు	చోడవరం యూపీఎస్	విశాఖ రేంజ్
జి.ప్రేమ్‌కుమార్	విశాఖ రేంజ్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్
ఎం.చంద్రశేఖర్	అనకాపల్లి టాస్క్‌ఫోర్స్	విశాఖ రేంజ్
ఎ.స్వామినాయుడు	విశాఖ రేంజ్	కశింకోట యూపీఎస్
ఎం.వినోద్‌బాబు	కశింకోట యూపీఎస్	విశాఖ రేంజ్
కె.లక్ష్మణమూర్తి	విశాఖ రేంజ్	అనకాల్లి డీఎస్‌బీ-2
కె.అప్పలనాయుడు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి సీసీఎస్
ఆర్.నీలయ్య	అనకాపల్లి సీసీఎస్	విశాఖ రేంజ్
ఎన్‌వీ ప్రభాకరరావు	విశాఖ రేంజ్	భోగాపురం యూపీఎస్
ఎ.రవికుమార్	భోగాపురం యూపీఎస్	విజయనగరం పీసీఆర్
సీహెచ్ రాజశేఖరరావు	విజయనగరం పీసీఆర్	విశాఖ రేంజ్
కె.అశోక్‌కుమార్	విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్	రాజాం టౌన్
డి.మోహనరావు	రాజాం టౌన్	కాశీబుగ్గ అర్బన్
ఎన్‌హెచ్‌వీ ఆనంద్	కాశీబుగ్గ అర్బన్	విశాఖ రేంజ్
జి .శంకరరావు	అనకాపల్లి టౌన్	చీపురుపల్లి
ఈ.నరసింహమూర్తి	విజయనగరం డీఎస్‌బీ-2	విజయనగరం మహిళాస్టేషన్
బి.నాగేశ్వరరావు	విజయనగరం మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
ఏవీ లీలారావు	విజయనగరం డీటీసీ	విజయనగరండీఎస్‌బీ-2
బి.లలిత	విజయనగరంలో రిజర్వు	విజయనగరం డీటీసీ
పి.సత్యనారాయణ	ఎల్విన్‌పేట	ఆమదాలవలస
దివాకర వాయునందన యాదవ్	ఆమదాలవలస	వీఆర్
బి.హరి	నర్సీపట్నం	ఎల్విన్‌పేట
ఎం.వెంకటనారాయణ	ట్రాన్స్‌కో నుంచి వచ్చిన అధికారి	అనకాపల్లి ట్రాఫిక్
పి.పైడపునాయుడు	అనకాపల్లి ట్రాఫిక్	వీఆర్
బి.ప్రసాదరావు	విశాఖ రేంజ్	కళింగపట్నం మెరైన్
కె.మురళీధర్	పార్వతీపురంమన్యం వీఆర్	పార్వతీపురంమన్యం డీఎస్‌బీ-2
ఆర్‌వీఎస్ఎస్‌సీహెచ్ శేఖరరావు	అనకాపల్లి డీఎస్‌బీ-2	అనకాపల్లి మహిళా స్టేషన్
డి.దీనబంధు	అనకాపల్లి మహిళా స్టేషన్	విశాఖ రేంజ్
సీహెచ్ వెంకటరావు	శ్రీకాకుళం మహిళా స్టేషన్	జి.మాడుగుల
సి.వాసునాయుడు	సాలూరు టౌన్	ఏఎస్‌ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్‌టాస్క్‌ఫోర్స్
బి.అప్పలనాయుడు	జీకే. వీధి	సాలూరు టౌన్

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు

చోడవరం, ఆగస్టు 17: గ్రామాల్లో ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకునేలా చూడాలని సిబ్బందికి జిల్లా వ్యవసాయాధికారి బి. మోహనరావు సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో చోడవరం, బుచ్చెయ్యపేట మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. సెప్టెంబరు 15 నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. ఈ-క్రాప్ నమోదు పైనే ఆధారపడి రైతులకు పథకాలు, బీమా అమలవుతుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ-క్రాప్ నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా స్థాయికి ఆ సమాచారం అందజేయాలని ఆదేశించారు. అంతకు ముందు పట్టణ శివారు అన్నవరం, వెంకయ్యగారి పేటల్లో వరిపైరును ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం అగ్రిల్యాబ్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రవీంద్రనాథ్, ఏవో పావని, ఏఈవో కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'బీఐఎస్ హెల్మెట్‌లనే వాడాలి'

అనకాపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ద్విచక్ర వాహనదారులు బీఐఎస్ హెల్మెట్‌లను మాత్రమే వినియోగించాలని జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఐఎస్ మార్కు కలిగిన హెల్మెట్లు చట్టబద్ధమైనవని, సురక్షితమని పేర్కొన్నారు. బీఐఎస్ మార్కు లేని హెల్మెట్‌లు విక్రయించే దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి వారికి అవగాహన కల్పించడమే కాకుండా జరిమానా విధిస్తామన్నారు. వాహనదారులతో రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

రెండు లారీలు సీజ్

లంకెలపాలెం, ఆగస్టు 17: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీలను శనివారం గనుల శాఖ అధికారులు పట్టుకున్నారు. పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో కొండపోరంబోకు భూముల్లో అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గనుల శాఖ ఆర్ఐ స్వాతి తన సిబ్బందితో కలిసి దాడి చేసి, రెండు లారీలను పట్టుకొని పరవాడ పోలీసులకు అప్పగించారు. లారీల యజమానులపై కేసులు నమోదు చేసినట్టు పరవాడ పోలీసులు తెలిపారు.

భద్రత కల్పించాలంటూ వైద్యుల ఆందోళన

- కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై నిరసనల వెల్లువ

ఎలమంచిలి, ఆగస్టు 17 : వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎలమంచిలిలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన రోడ్డు మీదుగా నినాదాలు చేసుకుంటూ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి కోల్‌కతాలో వైద్యాధికారిణిపై జరిగిన ఘాతుకాన్ని ఖండించారు. వైద్యాధికారిణి నిహారిక, సీఐటీయూ, ఏపీవీవీపీ, జేఏసీ, ఎస్ఎఫ్ఐ, వీఎఐఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కశింకోట : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల వైద్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వైద్యాధికారులు తిరుపతిరావు, రమేష్, యశోధ తదితరులు మాట్లాడుతూ వైద్య సిబ్బందిపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు. వీరి ఆందోళనకు ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ నాయకులు దాకారపు శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు.

పాయకరావుపేట : పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం సంఘటనకు నిరసనగా శనివారం పాయకరావుపేటలోని పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య, మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ సంకీర్తనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లి : ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఉదయం నుంచి పదకొండు గంటల వరకూ నక్కపల్లి 50 పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిరసన తెలియజేశారు. ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ శిరీషా, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల : ఇక్కడి వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది శనివారం ఆందోళన చేపట్టారు. వైద్యులు ప్రసాద్, గోదాదేవి, ఝాన్సీ, హానీషా, జయరాజ్‌లు, సిబ్బంది తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి మెయిన్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.



ఎలమంచిలిలో ప్రధాన రోడ్డుపై ఆందోళన చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురం, హరిపాలెం పీహెచ్‌సీల వైద్య సిబ్బంది శనివారం ఆందోళన నిర్వహించారు. అచ్యుతాపురంలో మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కారణంగా కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం, హరిపాలెం వైద్యాధికారులు శ్రావ్య, వసంత కుమార్, సీహెచ్‌వోలు వేణుగోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : రాంబిల్లి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. డాక్టర్ సిహెచ్.దీపిక, ఇన్‌చార్జి వైద్యాధికారి క్రాంతి కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి గాయాలు


మృతుడు యల్లయ్య రెడ్డి (ఫైల్ ఫొటో)

పరవాడ, ఆగస్టు 17 : ఆటోను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. కలపాక పంచాయతీ పరిధిలోని స్వయంభూవరం సమీపంలో శుక్రవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ ఎస్. బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పెదగంట్యాడ మండలం మరడిదాసరిపేటకు చెందిన ధర్మాల యల్లయ్యరెడ్డి (16), దాసరి అనిల్‌కుమార్‌తోపాటు పిట్టవానిపాలెం గ్రామానికి చెందిన కర్రి జనార్దనరెడ్డితో కలిసి శుక్రవారం రాత్రి ఆటోలో లైటింగ్ సామగ్రిని పరవాడలో ఓ శుభకార్యం వద్ద దించారు. అనంతరం ఆటోలో స్వగ్రామానికి వెళతుండగా స్వయంభూవరం దుర్గమాంబ ఆలయ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న లారీ వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవింగ్ చేస్తున్న కర్రి జనార్దన రెడ్డి, పక్కనే కూర్చున్న ధర్మాల యల్లయ్యరెడ్డి, ఆటో వెనుక తొట్టిలో కూర్చు న్న దాసరి అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురిని 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో యల్లయ్యరెడ్డి మృతి చెందారు. మృతుడు ఐటీఐ చదువుతున్నాడు. ఖాళీ సమయాల్లో లైటింగ్ పనులకు వెళ్తుంటాడు. మృతదేహానికి కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు కోలుకుంటున్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 17 : మండలంలోని మాసాహెబ్‌పేట శివారులో పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. వీరి నుంచి రూ.4,500ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

సినీ ఫక్కీలో ఎస్ఎంసీ ఎన్నికలు

- సామిల్లులో మధ్యాహ్నం వరకు తల్లిదండ్రులను బంధించిన వైసీపీ నేతలు
- పోలీసులు, విద్యా శాఖ అధికారులకు కూటమి నాయకులు ఫిర్యాదు
- పోలీసుల హెచ్చరికతో తల్లిదండ్రులను విడిచిపెట్టిన వైసీపీ నాయకులు
- అనంతరం జరిగిన ఎన్నికల్లో కూటమి మద్దతుదారుడు విజయం


టి.సిరసపల్లి పాఠశాలలో ఎన్నికైన కమిటీ సభ్యులు

మునగపాక (తుమ్మపాల), ఆగస్టు 17 : మండలంలోని టి. సిరసపల్లి ఎంపీపీ స్కూల్‌లో సినీ ఫక్కీలో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. శనివారం పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సందర్భంగా వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను రహస్య ప్రాంతానికి తీసుకువెళ్లి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రలోభ పెట్టడంతోపాటు భయపెట్టే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం పోలీసులకు చేరడంతో వారు వెళ్లి తల్లిదండ్రులను తీసుకువచ్చి ఎన్నికలు నిర్వహించారు. టి.సిరసపల్లి ఎంపీపీ స్కూల్‌లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో సుమారు 70 మంది తల్లిదండ్రులు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. వీరిలో 50 మంది తల్లిదండ్రులను స్థానిక వైసీపీ నాయకులు గ్రామ శివారులో గల సామిల్లు వద్దకు శనివారం తెల్లవారుజామున తీసుకెళ్లారు. అక్కడికి తీసుకెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులతో కొంతమంది వైసీపీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. కొంతమంది నాయకులు కూటమి బలపరిచిన వ్యక్తికి ఓట్లు వేసి గెలిపిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయం కూటమి నాయకుల దృష్టికి వెళ్లడంతో వారు పోలీసులు, విద్యాశాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వెంటనే సామిల్లులో బంధించిన విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల వద్దకు తీసుకురావాలని వైసీపీ నాయకులను ఫోన్‌లో కోరారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. దీంతో చేసేదేమి లేక వైసీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులను విడిచిపెట్టడంతో వారంతా పాఠశాల వద్దకు చేరుకున్నారు. అయితే ఎన్నికల్లో సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు పోలీసుల సహకారంతో బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించారు. దీంతో బ్యాలెట్ ఓటింగ్‌లో కూటమి బలపరిచిన పొలమరశెట్టి ఆనంద్‌కుమార్‌ను విద్యార్థుల తల్లిదండ్రులంతా చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, ఆగస్టు 17: వాల్తేరు డివిజన్ పరిధిలోని పూండి, నౌపడ, తిలారు, కోటబొమ్మాళి సెక్షన్లలో భద్రతా నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. వీటిలో పాండిచ్చేరి-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (12897) ఈనెల 21న పాండిచ్చేరిలో రెం డు గంటల 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుందన్నారు. అలాగే, కేఎస్‌ఆర్ బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18464) ఈనెల 21, 23వ తేదీల్లో బెంగ ళూరులో రెండు గంటల 30 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరే విధంగా రీ షెడ్యూ ల్ చేసినట్టు పేర్కొన్నారు. ప్రయాణికులు గమనించాలన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ప్రశాంతంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

▸ పోలీసు బందోబస్తు నడుమ నిర్వహణ ▸ కొన్నిచోట్ల వాయిదా ▸ అధిక శాతం కూటమి మద్దతుదారులు కైవసం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17 : పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. అనకాపల్లి పట్టణంలోని ఆరు ఉన్నత పాఠశాలలు, ఇరవై ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తూరు : ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కూండ్రం, వేటజంగాలపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం, బి.ఆర్‌టీ కాలనీ, కృష్ణాపురం కాలనీ, జగన్నాథపురం, తగరంపూడి, సీతానగరం, వెంకుపాలెం, మొండిపాలెం, అచ్చియ్యపేట తదితర గ్రామాల్లో అధికారులు పక్కాగా నిర్వహించారు.

తుమ్మపాల : అనకాపల్లి మండలంలో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 107 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 104 పాఠశాలల్లో ఈ ఎన్నికలు సజావుగా సాగాయి. కొప్పాక, సీతానగరం హైస్కూళ్లతో పాటు అనకాపల్లి గవరపాలెంలో గల గురుకుల పాఠశాలలో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. తదుపరి ఎన్నికల తేదీలను త్వరలోనే ప్రకటించనున్నట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు. దాదాపు అన్ని పాఠశాలల్లో కూటమి నాయకులు బలపరిచిన వారు మాత్రమే ఛైర్మన్లుగా ఎన్నికయ్యారు.

కశింకోట : మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఆనందపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో ఎన్నికలు జరగలేదు. నర్సింగబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కోరం లేక వాయిదా పడింది.

పాయకరావుపేట/రూరల్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 40 ప్రాథమిక, ఐదు ప్రాథమికోన్నత, 12 ఉన్నత పాఠశాలలు కలిపి 57 ఉండగా ఎస్.నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కోరం లేక ఎన్నికలు నిలిచిపోయాయి. మిగిలిన 56 పాఠశాలల్లోనూ ఎస్‌ఎంసీ సభ్యులు, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికలను టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో కూటమి నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడవడంతో అత్యధిక పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయి. పెంటకోటలో ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తయిన తరువాత ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంఈఓ కేవీఎస్ గాంధీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు చెప్పారు.

నక్కపల్లి : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 73పాఠశాలలకు గానూ 70 పాఠశాలల్లో ఎన్నికలు ముగిసినట్టు ఎంఈవో కె.నరేశ్ తెలిపారు. గొడిచెర్ల ఎంపీపీఎస్ స్కూల్, రాజయ్యపేట, గొడిచెర్ల హైస్కూళ్లలో కోరం లేక ఎన్నికలు వాయిదా వేసినట్టు చెప్పారు. ఎన్నికైన ఛైర్మన్లు, సభ్యులను పలువురు సత్కరించారు.

కోటవురట్ల : మండలంలోని పలు పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగాయి. నాలుగు పాఠశాలల్లో వివిధ కారణాలతో వాయిదా వేశారు. మండల వ్యాప్తంగా ఒక హైస్కూల్, నాలుగు జడ్పీ ఉన్నత పాఠశాలలు, పది యూపీ స్కూళ్లు, కేజీబీవీ పాఠశాల, 35 ఎంపీపీ పాఠశాలలకు ఎంఈవో రామారావు, జోషి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కైలాసపట్నం, రాజుగోపాలపురం, చినబొడ్డేపల్లి ఎంపీపీ పాఠశాలలు, అన్నవరం యూపీ స్కూల్‌కు ఎన్నికలను విద్యాశాఖ అధికారులు వాయిదా వేశారు.

ఎస్.రాయవరం : మండలంలో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 66 పాఠశాలలకు గానూ 64 పాఠశాలల్లో ఎన్నికలు జరిగినట్టు ఎలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు తెలిపారు. దార్లపూడి జడ్పీ హైస్కూల్, భీమవరం ప్రాథమికోన్నత పాఠశాలల్లో కోరం లేక వాయిదా వేసినట్టు చెప్పారు. 49పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరగ్గా, పదిహేను చోట్ల ఎన్నికలు నిర్వహించామన్నారు.

ఎలమంచిలి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కూటమి మద్దతుదారులు ఛైర్మన్లు, పాలకవర్గ సభ్యులుగా విజయం సాధించారు. మండలంలో 51 పాఠశాలల్లో ఈ ఎన్నికలు జరిపినట్టు ఎంఈవోలు అరుణ్‌కుమార్, మీనాక్షి తెలిపారు. అలాగే, మునిసిపాలిటీ పరిధిలోని 37 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, పదకొండు హైస్కూళ్లలో ఈ ఎన్నికలను నిర్వహించామని వివరించారు.


అచ్యుతాపురం : మండలంలోని పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 57 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 41, ప్రాథమికోన్నత పాఠశాలలు ఐదు, ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి. అయితే పూడిమడక శివారు కడపాలెం ప్రాథమిక పాఠశాలలో కోరం లేక ఎన్నిక జరగలేదని ఎంఈవో సీకే దేవరాయలు తెలిపారు.

రాంబిల్లి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. హైస్కూళ్లు, ప్రైమరీ, యూపీ పాఠశాలలు మొత్తం 58 ఉండగా, వీటిలో రెండు పాఠశాలల్లో విద్యార్థులు లేనందున వాటిలో జరగలేదు. మిగిలిన 56 పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించారు. అన్నిచోట్ల ప్రశాంతంగా ఎన్నికలు జరిపామని, ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు అంతా సహకరించాలని ఎంఈవో సూర్యారావు తెలిపారు.

పరవాడ : ఎస్‌ఎంసీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 65 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 13 హైస్కూళ్లు, 52 మండల పరిషత్ పాఠశాలలు ఉండగా, తానాం హైస్కూల్ మినహా మిగతా అన్నిచోట్ల ఈ ఎన్నికలు నిర్వహించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. తానాం హైస్కూల్‌లో 283 మంది విద్యార్థులకు 64 మంది విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే హాజరుకావడంతో ఎన్నిక నిలిపివేసినట్లు ఎంఈవో దివాకర్‌రావు తెలిపారు

సబ్బవరం : ఎస్‌ఎంసీ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 54 పాఠశాలలు ఉండగా, అందులో 51 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. ఎల్లుప్పి, గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఎన్నికలు జరగలేదు. పాత సబ్బవరం ప్రాథమిక పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు జరపలేదని ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ప్రతి స్కూల్ నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. కాగా, నల్లరేగులపాలెంలో ఎంపీటీసీ, ఉప సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారని వారు ఆరోపించారు. ఉపాధ్యాయులపై డీఈవో, ఎంఈవోలకు ఫిర్యాదు చేయనున్నట్టు ఎంపీటీసీ రాపేటి అరుణ తెలిపారు.
















ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి



నక్కపల్లి, ఆగస్టు 17 : ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. కొండపై ఉన్న స్వామివారి నిజరూపానికి తెల్లవారుజామున అభిషేకాలు నిర్వహించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని పట్టు పీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్

అనకాపల్లి టౌన్, ఆగస్టు 17 : ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా గోపాలపురం ఎంపీయూపీ పాఠశాలలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మొక్కలు నాటారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దాల రాంబాబు, జిల్లా సహాయ కార్యదర్శి యల్లపు వెంకటరమణాజీ, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి చాగంటి అవతారం, సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.






నర్సీపట్నం
నియోజకవర్గం

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



మొక్క నాటుతున్న సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో

నర్సీపట్నం, ఆగస్టు 17 : ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పరిపాలనాధికారి సూర్యనారాయణ, పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శెట్టి సుబ్బారావు, సెక్షన్ అధికారి భాగ్యలక్ష్మి, జర్నలిస్టులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకుడు స్వామి, సీహెచ్ రాము, ఎనుకూరి అప్పారావు, పసుపులేటి ప్రభాకర్ ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, శ్రీనివాసవర్మ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాతవరం ఆరోగ్యకేంద్రంలో యూనియన్ నాయకులు రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నాయకులు ఏడీ బాబు, పైల స్వామినాయుడు, చింతకాయల వరహాలబాబు, షేక్‌హుస్సేన్, బుజ్జి, రాము, కె.శ్రీను, ఎస్.రాము, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



నాతవరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ

పాఠశాలల యాజమాన్య కమిటీలు ఎన్నిక

▸▸ వాగ్వాదాలు, ఘర్షణలతో పాటు కోరం లేనిచోట్ల వాయిదా ▸▸ పలు చోట్ల పోలీసు బందోబస్తు నడుమ ప్రశాంతంగా నిర్వహణ





అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్న అధికారులు.., బూరుగుపాలెం పాఠశాల గేటుముందు తల్లిదండ్రులు నిరసన

నర్సీపట్నం, ఆగస్టు 17 : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు పలుచోట్ల స్వల్ప వివాదాలు మినహా శనివారం ప్రశాంతంగా జరిగాయి. నర్సీపట్నం మండలంలో పదిహేను ఉన్నత పాఠశాలలు, నాలుగు యూపీ స్కూళ్లు, 36 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మెట్టపాలెం యూపీ స్కూల్‌లో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది. లింగాలపాలెం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులు లేక ఎన్నిక జరగలేదు. మిలిగిలిన 53 పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అన్ని పాఠశాలల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 15 ఉన్నత పాఠశాలలో మూడు తప్పితే అన్ని ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బీసీ సామాజిక వర్గానికి చెందిన సభ్యుడ్ని పిలవక పోవడంతో అభ్యంతరం వ్యక్తమైంది. కొద్దిసేపు గొడవ జరిగింది. తర్వాత ఇరువర్గాలు అంగీకారానికి రావడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది.

పాకలపాడులో తోపులాట

గొలుగొండ : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో పాకలపాడులో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గాలకు చెందిన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తోపులాటకు దిగారు. దీంతో గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు పాఠశాలకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం పోలీస్ బందోబస్తు నడుమ ఎన్నిక నిర్వహించారు. అలాగే, మండలంలోని అన్ని పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురం, చోద్యం, సీహెచ్.నాగాపురం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ప్రశాంతగా జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను ఎన్నుకున్నారు. చోద్యం హైస్కూల్‌లో ఎన్నుకలు జరగ్గా, మిగిలన అన్నింటా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపాలెంలో ఇరువర్గాల ఆందోళనలు

మాకవరపాలెం : నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారని ఆరోపిస్తూ అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు వైసీపీ నాయకులు బూరుగుపాలెం హైస్కూల్ గేటు ముందు బైఠాయించారు. ఈ హైస్కూల్‌లో 24మంది డైరెక్టర్లకు పోటీ నిర్వహించారు. ఇందులో 21 డైక్టర్లకు సంబంధించి ఎన్నికలు పూర్తిచేశారు. అయితే ఎనిమిదో తరగతికి ముగ్గురు డైరెక్టర్లు పోటీ చేశారు. ఎన్నిక పూర్తయినప్పటికీ డైరెక్టర్లు ఎన్నిక సరిగా లేదంటూ ఇరువర్గాల మధ్యల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మళ్లీ ఎన్నిక నిర్వహించారు. ఇదే కాకుండా 33మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఓట్లు ఉండగా, 35మంది విద్యార్థుల తల్లిదండ్రులు రికార్డుల్లో సంతకాలు చేశారు. దీంతో టీడీపీ బలపరిచిన, వైసీపీ బలపరిచిన అభ్యర్థులు వాగ్వాదానికి దిగారు. చివరకు హైస్కూల్ గేటు ముందు వైసీపీ బలపరిచిన అభ్యర్థులతో పాటు ఎంపీపీ సత్యనారాయణ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గేటు ముందు బైఠాయించారు. ఎన్నికలు నిర్వహించాలని లేని పక్షంలో అధికారులుపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. ఎన్నికలు వాయిదా వేయాలంటూ టీడీపీ బలపరిచిన అభ్యర్థులు గొడవకు దిగారు. చివరకు ఎస్ఐ రామకృష్ణారావు అక్కడి నుంచి ఇరువర్గాలను చెదరగొట్టారు. సాయంత్రం ఐదు గంటలకు ఎనిమిదో తరగతికి సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు తహసీల్దార్ ప్రసాదరావు, ఎంఈవో మూర్తి ప్రకటించారు. దీంతో అక్కడి నుంచి ఇరువర్గాల నాయకులు వెళ్లిపోయారు. అలాగే కొండల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో 3,4 తరగతులకు సంబంధించి నిర్వహించిన ఎన్నికల్లో కోరం లేక చైర్మన్ ఎన్నిక వాయిదా వేసినట్టు ఎంఈవో తెలిపారు. ఇదిలావుంటే, మండలంలో పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికలు రెండు చోట్ల మినహా మిగిలి 51చోట్ల ప్రశాంతంగా నిర్వహించినట్టు ఎంఈవో తెలిపారు.

వైద్యుల ఆందోళన

▸▸ పలుచోట్ల మానవహారం

▸▸ కోల్‌కతాలో ఘాతుకానికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వస్తున్న వైద్యులు

నర్సీపట్నం, ఆగస్టు 17 : కోల్‌కతాలోని వైద్య కళాశాలలో వైద్యురాలిపై అత్యాచారం, పాశవిక హత్యకు పాల్పడిన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని ఐఎంఏ నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు డాక్టర్ మారుతీ కృష్ణ, కార్యదర్శి డి.మహేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రైవేటు వైద్యులు ఓపీ సేవలు బంద్ చేసి నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులతో నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారి సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల తొమ్మిదో తేదీన కోల్‌కతాలోని ఆర్‌జీకర్ ప్రభుత్వ కళాశాల ఆస్పత్రిలో రాత్రి డ్యూటీలో ఉన్న వైద్యురాలిపై సామూహిక అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన ఘటన సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. డాక్టర్ ఇందిరాదేవి మాట్లాడుతూ వైద్యురాలిపై జరిగిన హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ఇదే అంశంపై ప్రాంతీయ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి సారథ్యంలో సిబ్బంది ఏరియా ఆస్పత్రి నుంచి అబీద్ సెంటర్ వరకు ర్యాలీ జరిపారు. దోషులను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సు రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం పీహెచ్‌సీ వద్ద నిరసన తెలియజేశారు. వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎన్.హరిప్రవీణ్, ఎస్.గాయత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం : మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది శనివారం ఇక్కడ ఆందోళన చేపట్టారు. కోల్‌కతాలో జరిగిన ఘటనకు నిరసనగా మానవహారంగా ఏర్పడ్డారు. విధుల్లో ఉన్న వైద్యురాలిపై దారుణానికి ఒడిగట్టిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యాధికారులు శ్రీవిద్య, సీతారామలక్ష్మి, చరిష్మా, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ నాతవరంలో శనివారం నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఔట్ పేషెంట్లు లోపలికి వెళ్లకుండా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎమర్జెనీ కేసులకు మాత్రం వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో నాతవరం వైద్యాధికారిణి ప్రసన్న, గునుపూడి వైద్యాధికారులు ప్రియాంక, చింతకాయల నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

గొలుగొండ, ఆగస్టు 17: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై జిల్లా టాస్క్ ఫోర్సు కమిటీ శనివారం తనిఖీలు నిర్వహించారు. కమిటీ జిల్లా అధికారి లూసీ, డీపీఎం జగదీష్, జనార్ధన్‌లు ఇక్కడ మూడేళ్లగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలకు సంబంధించిన రికార్డులను గొలుగొండ గ్రామ సచివాలయంలో పరిశీలించారు. అలాగే కేజీబీవీ పాఠశాలలో కిశోర్ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాండవ హైస్కూల్‌లో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం

▸▸ పోలీసు బందోబస్తు ఏర్పాటు

▸▸ మధ్యాహ్నం వరకు చూసి.. కోరం లేకపోవడంతో ఎన్నికల వాయిదా

నాతవరం : మండలంలోని చమ్మచింత పంచాయతీ శివారు తాండవ హైస్కూల్‌లో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ నాయకులు మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కోరం లేకుండా ఎన్నికలు జరపవద్దని టీడీపీ నాయకులు పట్టుబట్టారు. అయితే వైసీపీ నాయకులు మాత్రం వచ్చిన తల్లిదండ్రుల చేత ఎన్నికలు జరిపించాలని ఘర్షణపడ్డారు దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేసి చూశారు. అప్పటికీ కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేశారు ఇక్కడ టీడీపీ నాయకులు షేక్ రజాక్, గంటా శ్రీను, శివలంక మల్లేశ్వరరావు, వైసీపీ నాయకులు షైనం బాబు, సిద్దాబత్తుల వెంకటరమణ వాగ్వాదం చేసుకున్నారు. అలాగే, పీకే గూడెం ప్రాథమిక పాఠశాలలో కూడా కోరం లేదంటూ టీడీపీ, వైసీపీ నాయకులు ఘర్షణ పడడంతో ఎన్నికల వాయిదా వేశారు. మిగతా 47 ప్రాథమిక పాఠశాల్లో, మూడు ప్రాథమికోన్నత పాఠశాల్లో, తొమ్మిది హైస్కూళ్లలో ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ఎన్నికలు వాయిదా పడిన పాఠశాలల్లో మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ఉన్నతాధికారులు తెలియజేస్తారన్నారు.



తాండవ హైస్కూల్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన దృశ్యం

చోడవరం
నియోజకవర్గం

సబ్ జైలును సందర్శించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

చోడవరం, ఆగస్టు 17: మండల కేంద్రంలోని సబ్ జైలును స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైలులో సౌకర్యాలపై ఖైదీలతో మాట్లాడారు. ఖైదీలకు ఇచ్చే ఆహారం, స్టాక్‌రూమ్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఖైదీలకు అందించే న్యాయసహకారం తదితర అంశాలను గురించి వివరించారు. సొంతంగా న్యాయవాదిని పెట్టుకోలేని వారు న్యాయ సలహా మండలి సేవలు వినియోగించుకోవచ్చని చెప్పారు. నేరాలకు దూరంగా ఉండి జీవితాలను చక్కదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో జైల్ అధికారి గణేష్, సిబ్బంది బాబూరావు, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

చోడవరం, ఆగస్టు 17: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు ఓరుగంటి రాంబాబు, ప్రగడ శ్రీనివాసరావు, కోవెల శ్రీను, నవకుమార్, రఘు, పారుపూడి సతీష్, సానా సతీష్, సత్యనారాయణ, ఎలక్ట్రానిక్ మీడియా సంఘం సభ్యులు బత్తుల రామకృష్ణ, జగదీశ్, దొండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పాఠశాల కోసం నిరసన



దండాలు పెట్టి నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట, ఆగస్టు 17: అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామాలైన పిత్రిగెడ్డ, నీళ్లబంద గ్రామాల్లో 15 కుటుంబాలకు చెందిన పీవీటీజీ గిరిజనులు ప్రత్యామ్నా పాఠశాల కోసం శనివారం ఆందోళనక దిగారు. ఆయా గ్రామాల్లో 20 మంది పిల్లలు పది కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి అర్ల పాఠశాలలో చదుకోవాల్సి రావడంతో గతంలోనే నిరసన తెలిపారు. దీంతో ప్రభుత్వం జూన్‌లో పిత్రిగెడ్డలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయనున్నట్టు హామీ ఇచ్చింది. ఇది జరిగి రెండు నెలలవుతున్నా అధికారులు ప్రతిపాదనలు కూడా పంపడం లేదని, తక్షణమే ప్రత్నామ్నాయ పాఠశాలను ఏర్పాటుచేసి, ఉపాధ్యాయుడిని నియమించాలని గిరిజనులు కోరారు. లేదంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆందోళన చేస్తామని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు.

వడ్డాది ఈవో లవరాజుకు సన్మానం

బుచ్చెయ్యపేట, ఆగస్టు 17: జిల్లా ఉత్తమ ఈవోగా అవార్డు అందుకున్న సందర్భంగా వడ్డాది మేజరు పంచాయతీ ఈవో లవరాజుకు శనివారం ఘన సన్మానం జరిగింది. సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, ఉప సర్పంచ్ దాడి సూర్యనాగేశ్వరరావు, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్, వడ్డాది పట్టణ వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీలు ఈవోను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ఈవో అందిస్తున్న సేవలను ప్రశంసిచారు.





వైద్య విద్యార్థిని మృతికి చోడవరంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న వైద్యులు... కె.కోటపాడు మూడు రోడ్ల కూడలిలో వైద్యులు, సిబ్బంది మానవహారం

రోడ్డెక్కిన వైద్యులు

కోల్‌కతా ఘటనపై ఆందోళన

అన్ని మండలాల్లో ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలతో నిరసన కార్యక్రమాలు

కుటుంబానికి న్యాయం చేయాలని.. వైద్యులకు రక్షణ కల్పించాలని నినాదాలు



మాడుగులలో వైద్యవిధాన పరిషత్ వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ


కోల్‌కతాలో హత్యాచారానికి గురైన యువతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వైద్యులు, సిబ్బంది శనివారం రోడ్డెక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రాణాలను కాపాడే వైద్యులకే రక్షణ లేకపోతే సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైద్య విద్యార్థినిపై దారుణానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు వైద్యులకు రక్షణ కల్పించేలా పటిష్టమైన చట్టాలను అమలు చేయాలని నినాదాలు చేశారు.


చోడవరం/మాడుగుల/బుచ్చెయ్యపేట/కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ, ఆగస్టు 17: తమ జీవితాలను త్యాగం చేస్తూ ఎందరో జీవితాలను నిలబడుతున్న వైద్యుల పట్ల సమాజంలో పెరిగిపోతున్న దాడుల నివారణకు ప్రభుత్వాలు కఠిన చట్టాలు అమలు చేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చోడవరం బ్రాంచి ప్రధాన కార్యదర్శి డాక్టర్ బండారు సత్యనారాయణ డిమాండ్ చేశారు. చోడవరంలో వైద్య విద్యార్థినిమృతిపై కొవ్వొత్తులు వెలిగించి సంతాపం ప్రకటించారు. అలాగే కొత్తూరు కూడలిలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణతో పాటు డాక్టర్ బంగారుకృష్ణ మాట్లాడుతూ డాక్టర్లకు రక్షణ కరువైందని, ప్రత్యేకించి మహిళలపై లైంగిక దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి నివారణకు ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డి.రవికుమార్, గాయత్రి రాజేష్, సత్యనారాయణ, దినేష్‌కుమార్, జ్యోతిర్మయి, సంకీర్తి పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట పీహెచ్‌సీ నుంచి పీఎసీఎస్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. వడ్డాది, బుచ్చెయ్యపేట, తురకలపూడి పీహెచ్‌సీ వైద్యులు మౌనిక, రమేష్, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పూజితా మేఘన ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మాడుగుల వైద్యులు, సిబ్బంది విధులను బహిష్కరించి మాడుగుల నలుమూలల ర్యాలీ చేశారు. వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులు సంతోష్‌కుమార్, రాంకుమార్, శ్రీలక్ష్మి, రేవతి, సిబ్బంది పాల్గొన్నారు. కె.కోటపాడు మండలంలోని చౌడువాడ, లంకవానిపాలెం, దేవరాపల్లి మండలం వేచలం పీహెచ్‌సీల వైద్యులు సిబ్బంది భారీ ర్యాలీ చేశారు. అనంతరం మూడు రోడ్ల సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు నందకిశోర్, డి.లక్ష్మి, ఎస్.శ్రీనివాసరావు, వి.కోటేశ్వరరావు, ఆర్.రమ, పి.ప్రశాంత్, వై.సునీల్, డి.నిర్మల, ఎం.త్రివేణి, బి.శైలజా, డి.సాయికిరణ్, జె.సన్యాసిరావు, బి.హారిక, పూజమేఘన, డి.గోవిందరెడ్డి, పి.శంకరరావు, అన్ని ఆసుపత్రుల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు

ఎక్కువ చోట్ల కూటమి మద్దతుదారులదే హవా

చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని విద్యాలయాల్లో శనివారం ఎన్నికల సందడి నెలకొంది. చీడికాడ మండలంలో మినహా అన్ని చోట్లా పాఠశాల నిర్వహణ కమిటీల ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఎక్కువ చోట్ల కూటమి మద్దతుదారుల హవా కనిపించింది.





చోడవరం: రాయపురాజులో విజయం సాధించిన టీడీపీ మద్దతుదారులు... మాడుగులలో కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/మాడుగుల/మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు/చీడికాడ, ఆగస్టు 17: చోడవరం మండలంలో నంబారువానిపాలెం పాఠశాల మినహా 60 విద్యా సంస్థల్లో శనివారం పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు ముగిశాయి. పది హైస్కూల్స్ ఒక జ్యోతిబాపూలే, కస్తూరిబా హైస్కూళ్లతో పాటు ఐదు ఎంపీయూపీ, 44 ప్రాథమిక పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించారు. ఒకటి రెండు పాఠశాలలు మినహా మిగిలిన అన్ని చోట్లా టీడీపీ/జనసేన/బీజేపీ కూటమి మద్దతుదారులే విజయం సాధించారు. చోడవరం హైస్కూల్ కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా కారు శ్రీనివాస్, డైరెక్టర్లుగా దాడి జగన్మోహన్, లక్ష్మణరావు, చుక్క మురళి, దాడి వెంకటపద్మ ఎన్నికయ్యారు. గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు, దాడి జగదీశ్, కోలా రమణ, శ్రీనివాస్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలో ఐదు పాఠశాలలు మినహా 57 పాఠశాలల కమిటీలకు ఎన్నికలు సజావుగా జరిగాయి. అత్యధిక పాఠశాలకు చైర్మన్‌లుగా కూటమి అనుయాయులే జయకేతనం ఎగురవేశారు. వడ్డాది జడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా కోవెల వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా పి.అనూషా గెలుపొందారు. వడ్డాది కస్తూర్బా, సీతయ్యపేట జడ్పీ హైస్కూల్, పెదపూడి, ఐతంపూడి, కొత్త కొండెంపూడి పాఠశాలలకు కోరం లేక వాయిదా పడ్డాయి. రోలుగుంట మండలంలోని కొంతలం హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలు మినహా 55 పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయని ఎంఈవో జగ్గారావు తెలిపారు. వీటిలో ఐదు జడ్పీ పాఠశాలల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, రెండు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. అలాగే రెండు యూపీ పాఠశాలలు, 38 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మాడుగుల మండలంలో రెండు మినహా 65 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. గొటివాడ అగ్రహారంలో ప్రైమరీ, హైస్కూల్‌లలో కోరం లేక వాయిదా పడ్డాయి. జడ్పీహెచ్ పాఠశాల చైర్మన్‌గా జొన్నపల్లి రమేష్, ఎంగబూరు పాఠశాల చైర్మన్‌గా భీమరాజు, బాలిక పాఠశాల చైర్మన్‌గా శ్యామల, గెడ్డబడి పాఠశాల చైర్మన్‌గా పుట్టా కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవరాపల్లి మండలంలో ఒకటి మినహా 55 పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తెనుగుపూడి గురుకుల పాఠశాల ఎన్నిక కోరం వాయిదా పడింది. ఎక్కువ శాతం కూటమి మద్దతుదారులనే ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు సిహెచ్.సూర్యనారాయణ ఎన్నికలలో విజయానికి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కె.కోటపాడు 52 పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 38 పాఠశాలల్లో ఏకగ్రీవం కాగా, 14 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు.

చీడికాడ మండలంలోని వరహాపురం హైస్కూల్ కమిటీ ఎన్నికలో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీ నాయకుల కేకలు, వాగ్వాదాలతో ఎన్నికలో గందరగోళం చోటు చేసుకుంది. దీంతో ఎస్ఐ జి.నారాయణరావుతో పాటు మరో 25 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. మిగిలిన అన్ని పాఠశాలల్లోనూ నిర్వహణ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.

మాడుగుల
నియోజకవర్గం

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

▸▸ మండల సర్వసభ్య సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం

మాడుగుల, ఆగస్టు 17: గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బంది అప్రమత్తం కావాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లు రావడం లేదని సభ్యులు తెలిపారు. మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేక అత్యవసర సమయాల్లో రోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రతీ మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు చెప్పుకోవడం తప్పితే పరిష్కార మార్గం కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలు మలినెలలో జరిగే సమావేశ సమయానికి పరిష్కారమైతేనే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు వస్తుందన్నారు. ప్రజా ప్రతినిధులను అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంపీపీ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, తహసీల్దార్ పీవీ రత్నం అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సాయం

దేవరాపల్లి, ఆగస్టు 17: మండల కేంద్రానికి చెందిన దుక్కా గోవింద లక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో చైతన్య గొంప చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఎల్లేటి కరుణాకరరావు ఆర్థిక సాయం అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె భర్త అప్పలరాజుకు రూ.50 వేల చెక్కును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ 2009లో అమెరికాలో స్థాపించిన ఈ సంస్థ పేదలకు విద్య, వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి రవికుమార్, గొర్లె దేముళ్లు, కె.చంద్రరావు, సత్తిరాజు, జి.సింహ, దుక్క సత్తిబాబు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సేవలు ఎనలేనివి'

కె.కోటపాడు, ఆగస్టు 17: సమాజంలో జర్నలిస్టులు అందిస్తున్న సేవలు ఎనలేనివని ఎంపీడీవో పట్నాయక్ అన్నారు. చోడవరం ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి నేమాల సతీష్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజంలో జరిగే సంఘటనలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా ఐక్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, బాల గంగాధర్, వెంకటరావు, సత్యనారాయణ, దాడి నరసింగరావు, వి.పరమేష్ పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: మాడుగుల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెయింటన్స్ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు జి.త్రినాథరావు, ఆర్.శ్రీను, ఈ.సురేష్, పి.శ్రీను, కె.నారాయణరావు, బి.జగ్గారావు, టి.శ్రీను, టి.జనార్ధనరావు, డి.నాయుడు, శంకర్, మణికంఠ, డి.అచ్యుతరావు పాల్గొన్నారు.